# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

# ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 01-02-2026                    సమయం : 6.45  గంటలు

## ముఖ్యాంశాలు

1. **కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్ ను ఈ రోజు లోక్ సభలో ప్రవేశపెట్టనున్నారు.**
2. **ఒక కుటుంబం ఒక పారిశ్రామిక వేత్త కార్యక్రమాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **రహదారి నిబంధనలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**
4. **వికసిత్ భారత్ కు 'విబిజి రామ్ జీ' పథకం దోహదపడుతుందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు.**
5. **తెలంగాణలోని మేడారం మహాజాతర, దేవతల వన ప్రవేశంతో ముగిసింది.**

----------------------

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్ను  ఈ రోజు లోక్సభలో ప్రవేశపెట్టనున్నారు. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం వరుసగా ఇది 9వ సారి.  ఆదివారం నాడు బడ్జెట్ ప్రవేశపెడుతుండడంతో ఈ బడ్జెట్పై ప్రత్యేక

ఆసక్తి నెలకొంది.  పార్లమెంటులో ప్రసంగం పూర్తయిన తర్వాత బడ్జెట్ పత్రాలు కేంద్ర బడ్జెట్ మొబైల్ యాప్, వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత, ఆర్థిక మంత్రి దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు ముప్పై మంది కళాశాల విద్యార్థులతో సంభాషిస్తారు.

-----------------------

“ఒక కుటుంబం ఒక పారిశ్రామిక వేత్త” కార్యక్రమాన్ని ఆదర్శవంతమైన పథకంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలో భాగంగా మార్గదర్శి-బంగారు కుటుంబం పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ లబ్దిదారులు, సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

..వాయిస్.. 30 సెకన్లు

-----------------------

రహదారి నిబంధనలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.  జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగాగుంటూరు జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన “శిక్షణతో భద్రత – సాంకేతికత ద్వారా పరివర్తన” కార్యక్రమంలో కేంద్ర మంత్రి నిన్న పాల్గొన్నారు యువత రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలని,  సీట్‌బెల్ట్, హెల్మెట్   ఈ సందర్భంగా కేంద్రమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

-----------------------

వికసిత్ భారత్ కు 'విబిజి రామ్ జీ' పథకం దోహదపడుతుందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి  భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం లో " వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్  గ్రామీణ్’ పథకంపై  బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యశాలలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో  నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకే  సరికొత్త సంస్కరణలతో ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.  ఉపాధి శ్రామికుల

ప్రయోజనాలను కాపాడడానికి, ఆర్థిక భద్రత కల్పించడానికి ఈ పథకం ఉపయోగపడుతుందని వివరించారు

-----------------------

భారత విమానయాన రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'వింగ్స్ ఇండియా అవార్డ్స్' లో ఆంధ్రప్రదేశ్ సత్తా చాటింది. "విమానయాన రంగానికి సంబంధించి స్పష్టమైన దృక్పథం, అంకితభావంతో పనిచేస్తున్న రాష్ట్రం" విభాగంలో ఆంధ్రప్రదేశ్ అవార్డుని దక్కించుకుంది. FICCI, కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సంయుక్తంగా.. విమానయాన రంగంలో సేవలకు గాను ఉత్తమ అవార్డులను ప్రకటించాయి. ప్రాంతీయ అనుసంధానం, విమానయాన మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలకు ఈ గుర్తింపు లభించిందని అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో జరిగిన వింగ్స్ ఇండియా 2026 అవార్డులలో కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కె. రామ్మోహన్ నాయుడు నుంచి ఆంధ్రప్రదేశ్ అధికారులు ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరును కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు 11 కోట్ల 75 లక్షల రూపాయలతో పనులు చేపట్టామని పట్టాణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. కోటి ఏడు లక్షల రూపాయలతో చేపట్టిన తొలి విడత పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం రామిరెడ్డి కాలువ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు 96 ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయని.. మార్చి ఆఖరుకల్లా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు.నగరంలో 20 కోట్ల రూపాయలతో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని, పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నామని మంత్రి నారాయణ వివరిస్తూ,

వాయిస్.. 30 సెకన్లు

-----------------------

తెలంగాణలోని మేడారం మహాజాతర దేవతల వనప్రవేశంతో ముగిసింది. గద్దెపై కొలువై మేడారంలో మూడు రోజులపాటు పూజలందుకున్న సమ్మక్కని గిరిజన సంప్రదాయాలతో పూజారులు వన ప్రవేశం చేయించారు. మిగతా గద్దెలపై పూజలందుకున్న సారలమ్మ,

పగిడిద్దరాజు, గోవిందరాజులను పూజారులు తమ ప్రాంతాల్లోని ఆలయాలకు తీసుకెళ్లారు. తెలంగాణ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సహ పలువురు ఉన్నతాధికారులు వనప్రవేశ వేడుకలో పాల్గొన్నారు.  నాలుగు రోజుల్లో రెండు కోట్ల మంది కి పైగా భక్తులు మేడారం జాతరకు తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారని అధికారులు తెలిపారు

-----------------------

తెలంగాణ వ్యాప్తంగా రేపటి  నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ ప్రారంభమవుతాయని  ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. హైదరాబాద్ లోని  ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రాక్టికల్స్ కు  1,440 కేంద్రాలనుఏర్పాటు చేశామని చెప్పారు. . పరీక్షల నిర్వహణ కోసం 7,559 మంది పరీక్ష పర్యవేక్షులను నియమించామని తెలిపారు. ప్రాక్టికల్స్ కు సంబంధించి ప్రత్యేకంగా ఇచ్చే హాల్‌టికెట్ల లింక్‌ను విద్యార్థుల ఫోన్లకు పంపించినట్లు చెప్పారు. ప్రాక్టికల్స్ జరగనున్న అన్ని కేంద్రాల్లో 6 నుంచి 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి.. ఇంటర్ బోర్డు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తామని చెప్పారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్  వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోని చౌకధరల దుకాణాల్లో ఈ రోజు నుంచి 20 రూపాయలకు కిలో గోధుమ పిండిని  పంపిణీ చేయనున్నట్లు పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. త్వరలోనే డివిజన్, మండల స్థాయి దుకాణాల్లోనూ అందుబాటులోకి తెస్తామన్నారు. దీపం పథకం కింద నాలుగో విడత గ్యాస్ సిలిండర్లను లబ్ధిదారులకు త్వరలో అందించనున్నట్లు మంత్రి వివరించారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లో చలి తీవ్రత తగ్గుముఖం పట్టిందని క్రమంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని  భారత వాతావరణ శాఖ -ఐఎండీ పేర్కొంది. ఉత్తర కోస్తా జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా, దక్షిణ కోస్తా, రాయలసీమలో సాధారణంగా నమోదయ్యే అవకాశముందని తెలిపింది. ఈ నెలకు సంబంధించిన వాతావరణ అంచనాలను  ఐఎండీ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరగొచ్చని తెలిపింది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ  సహా దక్షిణాది రాష్ట్రాల్లో చలిగాలులు వీచే అవకాశం లేదని పేర్కొంది. ఈరోజు, రేపు తెలుగు రాష్ట్రాల్లో  పలు చోట్ల పొగమంచు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది.

-----------------------

గోదావరి పుష్కరాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపట్టాలని పశ్చిమ గోదావరి జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. భీమవరంలోని కలెక్టర్ కార్యాలయంలో నిన్న నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, జిల్లాలో విద్యుత్ సరఫరా లేని ప్రాంతాలను గుర్తించి  నివేదికలు అందజేయాలని సూచించారు.  అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు పీఎం సూర్య ఘర్ పథకం కింద సౌర ఫలకాలు ఉచితంగా అమర్చేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

===================